# సాక్షి నంద్యాల

శుక్రవారం । 17 । జనవరి । 2025




## మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: సంక్రాంతి సెలవులతో మహానంది క్షేత్రానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



## నిత్యాన్నదానికి రూ. లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన రాధాకృష్ణ రూ. లక్ష విరాళాన్ని అందించారు.



## రైతన్నల జాతర

ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర జాతర సందడి మొదలైంది. నెల రోజుల పాటు జరిగే జాతరలో వ్యవసాయ సామగ్రితో పాటు సేద్యపు, పందెం ఎద్దులను విక్రయానికి ఉంచారు 8లో▸

## న్యూస్‌రీల్

### జ్వాలనరసింహుడి గర్భాలయ ద్వారానికి వెండి కవచం

- రూ. 30 లక్షలతో చేయించిన భక్తుడు



వెండి కవచంతో గర్భాలయ ద్వారం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఎగువ అహోబిలం జ్వాలనరసింహ స్వామి గర్భాలయానికి నంద్యాలకు చెందిన భక్తుడు రూ. 30 లక్షలతో వెండి కవచం చేయించాడని దేవస్థాన మేనేజర్ రాంభూపాల్ తెలిపారు. నంద్యాలకు చెందిన శ్రీ హనుమాన్ హార్డ్‌వేర్ దుకాణ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య శెట్టి తన మొక్కుబడిలో భాగంగా రూ. 30 లక్షలతో సుమారు 27 కిలోలతో ద్వారానికి వెండి తొడుగులు చేయించారన్నారు. వాటిని ఆలయ ద్వారాలకు గురువారం అలంకరించామన్నారు.

### శ్రీశైలం నుంచి 7,430 క్యూసెక్కులు విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి బుధవారం నుంచి గురువారం వరకు దిగువ ప్రాజెక్ట్‌లకు 7,430 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 1,702 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతలకు 338, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 490, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గురువారం సాయంత్రానికి జలాశయంలో 96.2698 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 856.70 అడుగులకు చేరుకుంది.

### అప్రెంటిస్‌కు అభ్యర్థుల ఎంపిక

- 25న ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కర్నూలు(అర్బన్): కర్నూలు ఏపీఎస్‌ఆర్టీసీలో 2024–25 సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడ్‌లలో అప్రెంటిస్‌కు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నజీర్ అహ్మద్ తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ ట్రేడ్ల వారీగా ఎంపికైన వారి సీరియల్ నంబర్లను ఆయన గురువారం ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, ఐటీఐతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులైతే కుల ధ్రువీకరణ పత్రాలను (పర్మినెంట్ సర్టిఫికెట్ లేని పక్షంలో ఆరు నెలల లోపు జారీ చేయబడిన తాత్కాలిక కుల ధ్రువీకరణ పత్రం ) తీసుకురావాలన్నారు. అలాగే వికలాంగులు తమ వైకల్య ధ్రువీకరణ పత్రం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఈ నెల 25వ తేదీన ఉదయం 9 గంటలకు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్‌లో హాజరు కావాలన్నారు. ఈ ఫలితాల అధికార నిర్ధారణ కోసం జోనల్ ట్రైనింగ్ కాలేజ్, డిపోల నోటీసు బోర్డుల్లో ఉంచామని వివరించారు.

### నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు (సిటీ): జవహర్ నవోదయ విద్యాలయం 2025–26 సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 18వ తేదీన నిర్వహించే పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని సి.బెళగల్ ఎంఈఓ–2 కె.ఆదాం బాషా, బనవాసి నవోదయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ప్రవేశ పరీక్ష నిర్వహణపై గురువారం స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 6,035 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కానున్నారని, కర్నూలులో 13, నంద్యాలలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షల్లో ఎలాంటి తప్పులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. 18వ తేదీ 11.30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

# అహోబిలేశా.. ఇదేమి దోపిడీ!



అహోబిలం దేవస్థానం

- ఇష్టానుసారంగా ధరల పెంపు
- టోల్‌గేటు మొదలు ప్రసాదం వరకు అన్నీ అంతే
- సామాన్య భక్తుడికి దూరమవుతున్న స్వామి దర్శనం
- పేరు మఠానిది.. పెత్తనం పచ్చ నేతలది
- రూ కోట్ల వనరులు 'తమ్ముళ్ల'కు అప్పగింత
- ట్రస్ట్‌లు, ఉద్యోగ ఏజెన్సీల పేరుతో కొత్తరకం దోపిడీ?

జనం చెంతకు భగవంతుడు అంటూ.. అహోబిలేశుడు పార్వేటగా పల్లకీలో వెళ్లి దర్శన భాగ్యం కల్పిస్తుండగా.. అహోబిల క్షేత్రానికి వచ్చిన భక్తులకు మాత్రం ఆ దేవదేవుడి దర్శనం భారంగా మారుతోంది. మఠం అధికారులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతూ భక్తులను విస్మరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. క్షేత్ర ఆదాయానికి గండి పడుతున్నా పచ్చ నేతలకు అడ్డదారిలో దోచిపెడుతూ.. ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు సామాన్య భక్తుల జేబులకు చిల్లులు పడేలా చేస్తున్నారు.





అహోబిలం ట్రస్ట్ అని దేవస్థానం ముందు ఉంచిన వాహనం

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీ నారసింహుడు.. ఈ మాట వింటేనే భక్తులు పరవశించిపోతారు. ఏటా వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులు తమ ఇష్ట దైవాన్ని దర్శించుకుంటారు. కోరిన కోర్కెలు తీర్చాలని ముడుపులు కడతారు. తమ ఇలవేల్పును ఒక్కసారైనా దర్శించి తరించాలని అందరూ కోరుకుంటారు. కానీ ఆ దర్శన భాగ్యం సామాన్యుడికి దూరం చేసే పరిస్థితిని అహోబిలం దేవస్థానం తీసుకొచ్చింది. 2022లో దేవదాయ శాఖ నుంచి అహోబిలం మఠం ఆధీనంలోకి వెళ్లింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవస్థానంలో తెలుగు తమ్ముళ్ల పెత్తనం శ్రుతి మించింది. అడ్మినిస్ట్రేషన్‌తో పాటు వైదిక కైంకర్యాలలో సైతం పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ ఉదంతం వెనుక ప్రస్తుత అధికారులు తమ వంతు సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీ అహోబిలేశుడిని దర్శనార్థం శని, ఆదివారాల్లో భక్తులు రోజుకు వెయ్యి నుంచి 2 వేల మంది వరకు వస్తుంటారు. పండుగలు, ప్రత్యేక రోజుల్లో అయితే రోజుకు 20 నుంచి 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు. అయితే దేవస్థానం పొలిమేరలో అడుగుపెట్టినప్పటి దోపిడీ మొదలవుతోంది. వాహనాలగేట్, కేశ ఖండన, శీఘ్ర దర్శనం , ప్రసాదం.. ఇలా ఒక్కటేంటి ? ప్రతి దాంట్లోనూ అందినకాడికి దోచుకుంటున్నారు. మొన్నటి వరకు దిగువ అహోబిలంలో మాత్రమే ఉన్న వాహనాల గేటు గత వారం రోజుల నుంచి ఎగువ అహోబిలం వెళ్లే వాహనానికి రూ. 70 వసూలు చేస్తున్నారు. రూ. 10 ఉన్న లడ్డూ ధర రూ. 20కి పెంచారు. తలనీలాలు రూ. 10 నుంచి రూ. 50, పుట్టు వెంట్రుకలు రూ. 20 నుంచి రూ. 100, శీఘ్ర దర్శనం రూ. 50 నుంచి రూ. 100 పెంచారు. ఎవరితోనూ చర్చించకుండా కనీసం పనిచేసే సిబ్బందికి సైతం తెలియకుండాపెంచారు. అయితే పాత ధరలు ఉన్న రసీదులతోనే పెంచిన ధరలు వసూలు చేస్తుండటంపై పలు విమర్శలకు తావిస్తోంది.

### తలనీలాల ఆదాయం గోవిందా.. గోవింద!

ఎక్కడైనా దేవస్థానాల్లో వేలం పాటలు నిర్వహించి ఆదాయం పెంచుకోవడం పరిపాటి. అయితే అందుకు విరుద్ధంగా అహోబిలంలో కొనసాగుతోంది. ఏటా రూ. 2.50 కోట్లు ఆదాయం తెచ్చి పెట్టే తలనీలాల వేలం పాట గత ఏడు నెలలుగా నిర్వహించలేదు. దేవస్థానంలో నిల్వ ఉన్న 1000 కిలోల వెంట్రుకలు కిలో రూ. 7 వేలు చొప్పున బేరం కుదిరినా వాటిని అధికార పార్టీ నేతకు భయపడి కిలో రూ. 3 వేలకు ఇవ్వడంతో పాటు తూకం కూడా వారికి ఇష్టమొచ్చినట్లు వేసుకుని ఎత్తుకెళ్లేలా అనుమతిచ్చారు. తలనీలాల విషయంలోనే దేవస్థానానికి సుమారు రూ. 30 నుంచి రూ .40 లక్షల దాక నష్టపోయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితో పాటు టెంకాయలు, బొమ్మల అంగళ్లు, కిరాణం, కూల్ డ్రింక్ ఇలా దశాబ్దాలుగా ప్రతి ఏడాది నిర్వహించే వేలం పాటలు నిర్వహించారు. ఈ సారి మాత్రం కేవలం పచ్చ నేతలు చెప్పిందే ధర.. అన్నట్లు సుమారు రూ. 4 నుంచి రూ. 5 కోట్లు వరకు ఆదాయం వచ్చే వేలం పాటలు తమ్ముళ్లకు అప్పనంగా తక్కువ ధరకు కట్టబెట్టారు. ఇప్పుడు గుడికి ఆదాయం తగ్గుతోందని సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగేలా దర్శనం టిక్కెట్లు, తలనీలాలు, ప్రసాదం ధరలు అమాంతం పెంచడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### దోచుకున్నోళ్లకు.. దోచుకున్నంత

➡ హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు 'అహోబిలం ట్రస్ట్' అని ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ద్వారా స్వామి పార్వేట పల్లకీ వెళ్లే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామని మరో రెండు ఎన్‌జీఓలతో ఎంఓయూ కూడా చేసుకున్నారు. అభివృద్ధి చేస్తున్నామని చూపించుకునేందుకు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉన్న ఓ పాత మొబైల్ మెడికల్ సర్వీస్ వాహనం తెచ్చి దేవాలయం ఎదురుగా ఉంచారు. ఇది చూపిస్తూ ఎన్ని రూ. లక్షలు వసూలు చేస్తున్నారో ఎవరికి అర్థం కావడం లేదు. తమకు సంబంధం లేదు అంటున్న దేవస్థాన అధికారులు ఈ వాహనం అక్కడ ఉంచడంతో పాటు ట్రస్ట్ నిర్వాహకుడు అని చెప్పుకునే వ్యక్తికి దేవస్థాన అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఓ ఆఫీస్ గదిని కూడా కేటాయించడం పలు విమర్శలకు తావిస్తోంది.

➡ గతంలో ఉత్తరప్రదేశ్‌లో గుడి కడుతున్నామని దేవస్థానం ఖాతా నుంచి రూ 3.25 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న విషయం తీవ్ర దుమారం లేపింది. దీంతో ఆరు నెలలకు తిరిగి అదే ఖాతాకు నగదు జమ చేయడం జరిగింది. అయితే ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారో ?, ఈ ఆరు నెలల వడ్డీ ఎవరు భరాయించాలో తదితర సవాలక్ష సమాధానం లేని ప్రశ్నలు భక్తులను వేధిస్తున్నాయి.

➡ అధికారే సొంత సంస్థ ఏర్పాటు చేసి ఆ సంస్థ తరుపున ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు తీసుకోవడంతో పాటు నెలనెలా వారి జీతాల్లో నుంచి భారీగా కమీషన్ కూడా పట్టుకునే విధంగా ఒప్పందం చేసుకుని కొంత మంది రిటైర్డ్ ఉద్యోగులను ఉద్యోగాల్లో తీసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్న ఉద్యోగులకే జీతాలు సక్రమంగా ఇచ్చే పరిస్థితి లేదని చెబుతున్న దేవస్థానం కొత్తగా ఇంత మందిని ఉద్యోగాల్లోకి తీసుకోవడంతో పాటు 15 నుంచి 20 సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకంటే వీరికి రెండింతలు జీతం ఇచ్చి తీసుకోవడం ఒక ఎత్తైతే వీరికి ఏ పని చెప్పకుండా గేట్ల దగ్గర నిల్చోబెట్టి రూ. లక్షల జీతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

### ఉన్నతాధికారుల ఆదేశానుసారమే



అహోబిలం ట్రస్ట్‌తో దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేదు. మొబైల్ మెడికల్ సర్వీస్ వాహనం ఇక్కడ ఉన్నది వాస్తవమే. దేవస్థానం పేరు చెప్పి వసూలు చేస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. వేలంపాటలు, ఇతర లావాదేవీల గురించి నాకు సంబంధం లేదు. టిక్కెట్ ధరల పెంపు ఉన్నతాధికారుల ఆదేశానుసారమే చేశాం. – మురళీధన్, జనరల్‌మేనేజర్, అహోబిలం దేవస్థానం

### గుడి ప్రతిష్టతను మంటగలుపుతున్నారు



సుమారు 40 ఏళ్లగా ఇలాంటి పరిస్థితి చూడలేదు. స్థానిక నాయకులతోను, గ్రామస్తులతో గాని ఏమాత్రం ఆలోచించకుండానే ఇష్టమొచ్చినట్లు నిర్ణయాలు తీసుకుంటున్నారు. మఠం నిర్వాహకులు అందరూ తమిళనాడులో ఉంటూ ఇంత పెద్ద దేవస్థానాన్ని గాలికొదిలేయడంతో ఇక్కడున్న అధికారులు గుడి ప్రతిష్టతను మంటగలుపుతున్నారు.

– నాసారి వెంకటేశ్వర్లు, అహోబిలం

### భక్తులను దోచుకునేందుకే..



అహోబిలంకు అత్యధికంగా వచ్చేదంతా గ్రామీణ ప్రాంతాల భక్తులే. ఇప్పటికే దిగువ అహోబిలంకు ఒక గేటు, ఎగువ అహోబిలంకు మరో గేటు వసూలు చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ప్రసాదం, దర్శనం, తలనీలాల టిక్కెట్ల ధరలు పెంచడమంటే భక్తులను దోచుకోవడమే. ఆదాయమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లుగా ఉంది.

– నాగార్జున రెడ్డి, దొరకొట్టాల

# ఉపాధి కూలీలకు 'హౌసింగ్' పని

- లేబర్ మొబిలైజేష పై ప్రత్యేక శ్రద్ధ సారించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు హౌసింగ్ మ్యాండేస్‌లో భాగంగా 90 రోజుల పని దినాలు కల్పించాలని, వారికి దినసరి సరాసరి రేటు పెరుగుతుందని క్షేత్రస్థాయి అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, హౌసింగ్ మ్యాండేస్, సచివాలయ సర్వీసులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మంజూరు చేసిన 850 గోకులం షెడ్ల నిర్మాణాలకు గాను 276 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్దేశించిన 4,772 గృహ నిర్మాణాల లక్ష్యాన్ని మార్చి 31వ తేదీలోగా పూర్తి చేసేలా హౌసింగ్ డీఈ, ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్ మొబిలైజేషన్‌కు సంబంధించి ఇంకా 16 లక్షల 5 వేల పని దినాలు కల్పించాల్సి ఉందన్నారు. ప్రతిరోజు ప్రతి గ్రామపంచాయతీలో వందమంది ఉపాధి వేతనదారులకు మార్చి 31వ తేదీలోగా పనులు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీఓ, ఎపీడీ, ఎంపీడీఓలను ఆదేశించారు. సచివాలయ సిబ్బందికి కేటాయించిన ఎనిమిది రకాల సర్వేలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయించాలని ఎంపీడీఓలకు సూచించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు ఇన్‌టైం, అవుట్ టైం కచ్చితంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జనార్దన్ రావు, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రిజిస్ట్రేషన్‌కు 21న తుది గడువు

నంద్యాల(న్యూటౌన్): పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఈనెల 21వ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ చదివి.. వయస్సు 21 నుంచి 24 సంవత్సరాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ రెగ్యులర్ కోర్సులు చదివి ఉండాలని, ఫుల్‌టైం ఉద్యోగం, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నవారు అనర్హులని తెలిపారు. వివరాలకు 8297812530ను సంప్రదించాలన్నారు.

### అతివేగం ప్రమాదకరం

- ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా



రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: రహదారులపై అతివేగంతో వెళ్తే వాహనదారుని ప్రాణాలకే ప్రమాదమని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఎంవీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రహదారులపై వాహనాలను నిబంధనల మేరకు నడపాలన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 15 వరకు మాసోత్సవాలు జరుపుతున్నామన్నారు. ప్రతి విద్యాలయాల్లో, ఆటో డ్రైవర్లకు, ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఎంవీఐ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

#### డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

నంద్యాల (వ్యవసాయం): రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా అన్నారు. రోడ్డు భద్రత మసోత్సవాల సందర్భంగా నంద్యాల ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి , ట్రాఫిక్ ఎస్ఐ మధు, డిపో మేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ మాధవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో శాస్త్రోక్తంగా యాగ పూర్ణాహుతి

- నేటితో ముగియనున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



ధ్వజ పట అవరోహణ దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో యాగ పూర్ణాహుతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపారు. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు. అనంతరం వసంతోత్సవం జరిపించారు. చండీశ్వరస్వామికి సరస్వి పుష్కరిణిలో అర్చకులు, ఈఓ ఎం .శ్రీనివాసరావు శాస్త్రోక్తంగా అవబృథస్నానం నిర్వహించారు.

➡ సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలను నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులు వేదస్వస్తి చేశారు. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన కల్యాణోత్సవం జరిపించిన అమ్మవారికి ఆగమశాస్త్ర సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలను సమర్పించారు.

➡ సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజున ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేశారు.

➡ శుక్రవారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు అశ్వవాహనసేవలో భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ జరిపిస్తారు. ఆయా ఉత్సవాలతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

#### వేదపారాయణం

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మూడు గంటల పాటు నిరంతరాయంగా వేదపారాయణలు కొనసాగాయి. దేవస్థాన పండితులతో పాటు సింహాచలం, విశాఖపట్నం కనకమహాలక్ష్మీ ఆలయం, కాణిపాకం, శ్రీకాళహస్తి, అన్నవరం, ద్వారక తిరుమల, ఇంద్రకీలాద్రి–విజయవాడ దేవస్థానాల నుంచి వచ్చిన పండితులు, తిరుపతి, హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు పండితులు పాల్గొన్నారు. రుత్విగ్వరణ కార్యక్రమంలో పండితులకు నూతన వస్త్రాలు అందజేశారు. దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

# విషం పొంగుతోంది!

- జిల్లాలో ఆక్సిటోసిన్ విచ్చలవిడిగా వినియోగం
- పాడిపశువుల పాలసేపునకు నిషేధ ఇంజెక్షన్
- కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున దిగుమతి
- స్పందించని పశుసంవర్ధక శాఖ అధికారులు

కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో 2018లో ఒక పాడి పరిశ్రమ నిర్వాహకుడి దగ్గర ఆక్సిటోసిన్ 100 ఎంఎల్ నాలుగు బాటిళ్లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిఘాను కట్టుదిట్టం చేసింది. పశుపోషకుల షెడ్ల వద్ద దాడులు విస్తృతం చేసింది. ఇంతవరకు ఆక్సిటోసిన్ దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మళ్లీ వినియోగం భారీగా పెరిగింది. కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుని వినియోగిస్తున్నారు. లేబుల్ లేకుండా పశు పోషకులకు అంటగడుతున్నారు. 100 ఎంఎల్ ఆక్సిటోసిన్ రూ. 300 ప్రకారం విక్రయిస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు తదితర పట్టణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

కర్నూలు (అగ్రికల్చర్): పశువైద్యుల సిఫార్సు లేకుండా ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ వినియోగించరాదని ప్రభుత్వం కొన్నేళ్ల క్రితమే ఆదేశాలు ఇచ్చింది. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో సగం మంది పాడి పరిశ్రమల నిర్వాహకుల్లో దీనిని వాడుతున్నారు. దీని ప్రభావంతో నాలుగైదు నిమిషాల్లోనే పాడిపశువులు సేపునకు వస్తాయి. ఇలాంటి పాలు తాగడంతో పిల్లల్లో దృష్టిలోపం, వినికిడి లోపం వస్తోంది. సూదులు వేసిన పశువుల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. పాల సేపునకు ఆక్సిటోసిన్ సూదులను వినియోగించకుండా నివారించాల్సిన పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### అధిక పాల కోసం..

ప్రస్తుతం కొందరు పాడి పరిశ్రమ నిర్వాహకులు 'ఆక్సిటోసిన్' ఇంజెక్షన్‌ను కేవలం అధిక పాల ఉత్పత్తి కోసం వాడుతున్నారు. సాధారణంగా గేదెలు శరీరంలో ఉండే మొత్తం పాలను బయటకు ఇవ్వవు. పొదుగులో ఉండే మొత్తం పాలు పిండినప్పుడు సులువుగా వచ్చేస్తుంది. అయితే వాటి శరీర కండరాల్లో, ఎముకల మూలన ఇంకా కొంత పాలు అలానే ఉంటుంది. ఎప్పుడైతే ఇంజెక్షన్ వాడుతారో గేదె శరీర కండరాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది. సాధారణంగా ఐదు లీటర్ల పాలు ఇచ్చే గేదెం ఈ ఇంజెక్షన్‌తో శరీరం ఉత్తేజాన్ని గురై మరో రెండు, మూడు లీటర్ల పాలు అధికంగా ఇస్తుంది.

#### దూడలను దూరం చేస్తూ..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాడి పరిశ్రమ నేడు వ్యాపారం అయ్యింది. దూడలకు వదిలితే పాలు తక్కువవుతాయనే ఉద్దేశం చాలా మందిలో ఉంది. వాటికి పాలు సరిగ్గా ఇవ్వకపోవడంతో కొద్ది రోజులకే మృత్యువాత పడుతున్నాయి. పాడి పశువుల్లో 40 శాతం వరకు మగ దూడలు పుడుతున్నాయి. అయితే వీటిని సరిగ్గా పట్టించుకోకపోవడం లేదు. పెయ్య దూడల పోషణలోనూ సరైన శ్రద్ధ వహించకపోవడంతో వాటిలో 20 శాతం వరకు మూడు నెలల్లోనే మృత్యువాత పడుతున్నాయి. దూడలు లేని పాడి పశువులకు ఈ సూది వేస్తున్నారు. సేపునకు తెచ్చుకొని పాలు పితుకుతున్నారు.



#### గుట్టుచప్పుడు కాకుండా..

ఆక్సిటోసిన్ హార్మోన్ సూది వినియోగంపై కట్టడి చేయడంతో పాడిపరిశ్రమ నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా కూడా కొందరు చాటుగా విక్రయిస్తున్నట్లు సమాచారం. కర్ణాటక నుంచి ఒకేసారి 500 ఎంఎం తెచ్చుకొని, ఒక ఎంఎల్ ఒక డోసుగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పాల ఉత్పత్తి తగ్గింది. కొన్నేళ్లుగా విద్యావంతులు, ఇంకొందరు పాడి పరిశ్రమలో రాణిస్తున్నారు. అయితే దూడలను పట్టించుకోకుండా వాటి మృత్యువుకు కారణమవుతున్నారు.

### ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాడి గేదెలు: 1.50 లక్షలు

వీటిలో 50 శాతం గేదెలకు 'ఆక్సిటోసిన్' ఇంజెక్షన్ వేసి పాలు పితుకుతున్నారు

#### స్వస్తి పలకాలి



పాలు పితకడానికి ముందు కొద్దిసేపు దూడలను వదిలితే పాడిపశువులు సేపునకు వస్తాయి. ఫలితంగా పశువు ఆరోగ్యం బాగుండి వెంటనే ఎదకు వస్తుంది. పాలసేపునకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్‌ను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. దీనిని వాడితే పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ సూదులు పని చేయడం లేదు. రైతులు, డెయిరీ నిర్వాహకులు ఆక్సిటోసిన్ సూదితో పరోక్షంగా నష్టపోతున్నారు. దీనికి స్వస్తి పలకాలి.

– ఆర్.నాగరాజు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, డోన్

#### ఇవీ సమస్యలు..



- ➡ ఆక్సిటోసిన్ సూదులు వాడితే పాడి పశువులు సకాలంలో ఎదకు రావు. ఎదకువచ్చినా చూలు నిలువకపోగా, కొన్ని సందర్భాల్లో గర్భస్రావం జరుగుతుంది.
- ➡ ఈ హార్మోన్ కలిసిన పాలు తాగితే చిన్నపిల్లలకు దృష్టి, వినికిడి లోపం వచ్చే అవకాశం ఉంది. అలాగే పలు సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ➡ కళ్ల జబ్బులతో పాటు ప్రమాదకర క్యాన్సర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ➡ బాలికలు చిన్న వయస్సులోనే మెచ్యూర్ అవుతారు.
- ➡ ఈ హార్మోన్ ప్రభావంతో శరీరంలో శక్తి నశించి త్వరగా అలసట వస్తుంది.

## క్లుప్తంగా

### సర్పంచ్ కుటుంబంపై టీడీపీ వర్గీయుల దాడి



ఆదోనిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ సుధారాణి

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ సుధారాణి, ఆమె భర్త పెద్దరెడ్డి, కుమారుడు సతీష్‌రెడ్డిపై బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు ఆరుగురు కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పంచ్ ఇంటికి ఎదురుగా ఉన్న సుంకన్న, అతని కుమారులు చీటికిమాటికీ దుర్భాషలాడుతున్నారని, తామేమి తప్పు చేశామని ప్రశ్నించడంతో, తమనే ప్రశ్నిస్తావా అంటూ సుంకన్న, కృష్ణ, సుదర్శన్, ఓబులేష, సుంకులమ్మ, రాధిక కలిసి కట్టెలు, రాళ్లతో తమపై దాడి చేశారని సర్పంచ్ భర్త పెద్దరెడ్డి ఆస్పరి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. గాయపడిన ముగ్గురు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెద్దరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చిట్టిబాబు(ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన చిట్టిబాబు(30) రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిట్టిబాబు రోజులాగే ఉదయం వరికోత మిషన్ల పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో దొర్నిపాడుకు బయలుదేరాడు. ఊరు శివారులోకి వెళ్లగానే మలుపు వద్ద వేగంగా వస్తున్న మరో బైక్‌కు సైడు ఇచ్చే క్రమంలో వెనకవైపు తాకడంతో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్పమ్మతోపాటు మూడేళ్ల కుతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఇన్నోవా చోరీ

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట ఉంచిన ఇన్నోవా క్రిస్టా చోరీకి గురైంది. గోనెగండ్ల మండలం కైరవాడికి చెందిన ఆంజనేయులు హైదరాబాద్‌లో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. నీలకంఠేశ్వర స్వామి జాతర నిమిత్తం బుధవారం టీఎస్ 09 ఎఫ్‌ఓ 2367 నంబర్ ఇన్నోవాలో ఎమ్మిగనూరుకు వచ్చి ప్రభుత్వాసుపత్రి ఎదుట ఉంచాడు. జాతరలోకి వెళ్లి వచ్చేలోపు ఇన్నోవా కనిపించలేదు. చోరీకి గురైందని నిర్ధారించుకుని పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు గురువారం తెలిపారు.



సుఖ ప్రసవమైన అక్కాచెల్లెళ్లతో గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్యశిల్ప

### గైనకాలజీలో అరుదైన ఆపరేషన్లు

మండలంలోని యు కొత్తపల్లెకు చెందిన అక్కాచెల్లెళ్లు ఫాతిమా, మాసన్న గర్భం దాల్చిన తర్వాత డోన్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్నారని తెలుసుకున్న డాక్టర్లు చాకచక్యంగా సాధారణ కాన్పులు చేశారు. ప్యాపిలి మండలం నేరేడుచెర్లకు చెందిన అశ్విని 4 అడుగుల ఎత్తు మాత్రమే ఉంది. రక్తంలోని హిమోగ్లోబిన్ కూడా 4 శాతమే ఉంది. పైగా హైబీపీతో బాధపడుతోంది. నిండు గర్భిణిగా ఉన్న ఆమెకు ఇక్కడి డాక్టర్లు రేయింబవళ్లు కష్టపడి రక్తం ఎక్కించిన సుఖ ప్రసవం చేశారు. మరో గర్భిణి సువర్ణకు అతి కష్టం మీద సాధారణ కాన్పు చేశారు. ఆమె కవలలకు జన్మనిచ్చింది.



కవలలకు జన్మనిచ్చిన సువర్ణ



డోన్‌లో నూతనంగా నిర్మించిన వంద పడకల ప్రభుత్వాసుపత్రి

# కార్పొరేట్ వైద్యం.. గత ప్రభుత్వ చలువే!



ఓపీకి హాజరైన గర్భిణులు

- అరుదైన ఆపరేషన్లకు కేంద్ర బిందువుగా డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రి
- కర్నూలుకు వెళ్లకుండా ఇక్కడే ప్రసవాలకు మొగ్గుచూపుతున్న గర్భిణులు

డోన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే గొప్ప ఆశయంతో రాష్ట్రంలోని అనేక ప్రభుత్వాసుపత్రుల స్థాయిని పెంచి మౌలిక వసతులు కల్పించింది. అందులో నంద్యాల జిల్లా డోన్ ప్రభుత్వాస్పత్రి ఒకటి. ఇక్కడ ఉన్న 30 పడకల ప్రభుత్వాసుపత్రి స్థాయిని వంద పడకలకు పెంచి రూ.40 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునిక వసతులతో భవనాలు నిర్మించింది. ఈఎన్‌టీ, డెంటిస్ట్, ఆర్థోపెడిక్, యూరాలజీ, ఐ, గైనకాలజీ తదితర 14 విభాగాలకు నిష్ణాతులైన వైద్యులను నియమించింది. ఏ చిన్న ప్రమాదం జరిగినా ఎక్స్‌రే, ఆపరేషన్ అంటూ ఈ ప్రాంతంలోని 9 మండలాల ప్రజలు కర్నూలు సర్వజన ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిన వసరం లేకుండా పోయింది.

### కార్డియాటిక్ సమస్య ఉన్న గర్భిణికి సైతం..

కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి చెందిన గర్భిణికి మొదటి కాన్పులో సిజేరియన్ జరిగింది. రెండవ కాన్పు కోసం ఆమె డోన్ ప్రభుత్వాసుపత్రిలో చేరగా, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆమెకు సంబంధిత వైద్యులు, అధునాతన పరికరాల సహాయంతో సాధారణ కాన్పు చేశారు. ఈ విషయంలో తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉండటంతో వారిని నిర్ణీత సమయానికి డిశ్చార్జ్ చేసి ఊపిరి పీల్చుకున్నారు.

### బ్లడ్ బ్యాంక్ అవసరం



చాలా మంది గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోక రక్తహీనత బారిన పడుతున్నారు. ఇలాంటి వారు తీరా ప్రసవించే సమయానికి సరైన మోతాదులో రక్తం లేకపోవడంతో ప్రాణాల పైకి తెచ్చుకుంటున్నారు. డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో ప్రతిరోజూ 50 నుంచి 60 ఓపీలు, 10 వరకు ఆపరేషన్లు జరుగుతున్నందున ఇక్కడ బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేస్తే సుఖ ప్రసవాలకు అవకాశం ఉంటుంది.

– డాక్టర్ అనురాధ, హెచ్‌ఓడీ, గైనకాలజీ విభాగం, డోన్

### తల్లీబిడ్డ క్షేమమే మా ధ్యేయం

ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారిలో అత్యధికులు నిరుపేదలు ఉంటారు. సామాన్య, మధ్యతరగతి గర్భిణులలో ఎక్కువ శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రసవ సమయంలో హైరిస్క్ ఉంటుందని భావిస్తే తప్ప ఏ ఒక్కరినీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేయం. ఆసుపత్రిలో ఆధునిక సౌకర్యాలతో పాటు మౌలిక వసతులు, అనుభవం ఉన్న గైనకాలజిస్టులు ఉన్నందున ఎక్కువ శాతం పేద గర్భిణులు ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారు.

– డాక్టర్ రమ్యశిల్ప, సీనియర్ గైనకాలజిస్ట్, ప్రభుత్వాసుపత్రి, డోన్

### సెల్స్ సేకరణ

శ్రావణి అనే గర్భిణికి కాన్పు సమయంలో వైద్యులు రక్తకణాలు సేకరించి డిపాజిట్ చేశారు. యుక్త వయసు వచ్చిన తర్వాత కూడా తల్లి, బిడ్డలకు క్యాన్సర్ సోకితే కాన్పు సమయంలో సేకరించిన బొడ్డుతాడు, రక్తకణాల ద్వారా శస్త్రచికిత్స చేసేందుకు ఈ సెల్స్ ఎంతో ఉపయోగపడతాయి. శ్రావణి దంపతులు ఈ లైఫ్‌సెల్ డిపాజిట్ కోసం ప్రభుత్వ నిబంధనలన్నీ పాటించారు.



### ప్రభుత్వాసుపత్రిలోనే డాక్టర్ భార్య ప్రసవం

ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు శశికుమార్ నెలలు నిండిన తన భార్య పశువైద్యురాలు డాక్టర్ సుమను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి గైనకాలజిస్టుల సహాయంతో సుఖ ప్రసవం జరిగేందుకు సహకరించారు. దీంతో ఆసుపత్రిలో సౌకర్యాల పట్ల వైద్యుల సామర్థ్యం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు తొలిగిపోయి అత్యధిక సంఖ్యలో గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలో చేరేందుకు మొగ్గ చూపుతున్నారు.





ఆటోలో కిక్కిరిసి ప్రయాణిస్తున్న కూలీలు

### పని కోసం సాహస ప్రయాణం

ఉన్న ఊళ్లలో పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రోజు రోజుకు ఖర్చులు పెరిగిపోతున్నాయి. కుటుంబ పోషణ, పిల్లల ఫీజు ఖర్చుల కోసం మహిళలు ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్తున్నారు. ప్రమాదకర ప్రయాణమని తెలిసినా విధి లేని పరిస్థితుల్లో ఆటో టాప్‌లపై కూర్చుని ప్రయాణి సాగిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రతి రోజు ఐదారు వందల మందికి పైగా మహిళలు అవుకు, సంజామల మండలాలతో పాటు పొరుగు జిల్లాలకు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకే క్యారియర్లు సిద్ధం చేసుకొని బయలుదేరుతున్నారు. మధ్యాహ్నం మూడు కల్లా ఇళ్లకు చేరుకుంటారు. కూలీ రూ.300 కాగా ఆటోకు రూ.50 చెల్లిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు ఏదో ఒక సంక్షేమ పథకం పేరుతో వారి అకౌంట్లలో డబ్బు జమ అయ్యేది. వాటితో ఏడాదికి సరిపడా బియ్యం ప్యాకెట్లు, ఇతర కుటుంబ అవసరాలకు ఉపయోగించుకునే వారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం హామీలు గాలికొదిలేయడంతో వందలాది మంది మహిళలు వలస బాట పడుతున్నారు.

– కొలిమిగుండ్ల

### 22న జిల్లా స్థాయి రంగోత్సవ పోటీలు

కర్నూలు సిటీ: ఈనెల 22న బి.తాండ్రపాడులోని ప్రభుత్వ డైట్ కాలేజీలో జిల్లా స్థాయి రంగోత్సవం పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షంషుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద ఉన్న విద్యాసంస్థల్లోని 6 నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులన్నారు. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల గురించి క్విజ్, భారత స్వాతంత్ర్య సమరయోధులపై డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్‌లో చేతి రాత, 8 నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు రంగోలి పోటీలు ఉంటాయన్నారు. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల్లోని ఫోక్ డ్యాన్స్ పోటీలు, యూనిటీ, ఇంటిగ్రిటీ పోస్టర్, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్(స్లోగన్ రచనలు), రోల్ ప్లే(భారత దేశ సంస్కృతి, చరిత్ర, విలువలు)వంటి అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఒక పోటీలో పాల్గొన్న వారు మరో పోటీలో పాల్గొనరాదన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు భోజన వసతి ఉంటుందన్నారు. పోటీకి అవసరమైన సామగ్రిని విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు ఈనెల 24న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8985126758ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయండి

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులపాటు జరిగే మాసోత్సవాల్లో రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అతివేగంతో వాహనాలను నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, లైసెన్స్ లేకపోవడం వల్ల పడి జరిమానా, జైల్ శిక్షల గురించి వివరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు డ్రైవర్‌తో పాటు అందరూ సీటు బెల్టు ధరించాలని, కారు నడిపే సమయంలో మొబైల్ ఫోన్‌ను వినియోగించరాదనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించి రోడ్డు దాటే అంశాలపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా, డీటీసీ శాంతకుమారి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

### నంబర్ రాళ్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



ఆలూరు చెరువులో పాతిన నంబర్ రాళ్లు తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఆలూరు రూరల్: ఆలూరు చెరువు భూమి ఆక్రమణపై మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గురువారం ఆ శాఖ అధికారులు ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించారు. ప్రైవేటు ప్లాట్ల మాదిరి కబ్జాదారులు పాతిన రాళ్లను తొలగించారు. నాలుగు రోజుల క్రితం ఆలూరు చెరువులోని సర్వే నంబర్ 748లోని సీఎల్ఆర్‌సీ కార్యాలయం వెనుక భాగంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు 50 సెంట్ల స్థలంలో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడంతో 'ఆలూరు చెరువులో రాళ్లు మొలిచెన్' శీర్షికన మంగళవారం సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు గురువారం శాఖ డివిజన్ అధికారి చెన్నకేశవ రెవెన్యూ సిబ్బందితో వెళ్లి.. అక్రమంగా నాటిన రాళ్లను తొలగించారు. ఆలూరు చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐ వెంకటచలపతికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు డీఈ చెన్నకేశవ తెలిపారు. చెరువు భూమిని సర్వే చేయించి కంచె ఏర్పాటు చేస్తామన్నారు. వీఆర్వో మహీంద్రా, సర్వేయర్ దేవేంద్ర నాయక్ ఉన్నారు.

#### అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ఆలూరు చెరువు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హనుమంతు నాయకులు కృష్ణ, షాకీర్ ఇరిగేషన్ డీఈ చెన్నకేశవకు వినతి పత్రం అందించారు. కొన్నేళ్లుగా చెరువు భూమి ఆక్రమణకు గురవుతూ వస్తోందని, చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ డీఈని కోరారు. చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదన చేయాలన్నారు.

### వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న కార్యదర్శి బీ లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(అర్బన్): వృద్ధులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు సంస్థ కార్యదర్శి బీ లీలా వెంకటశేషాద్రి తెలిపారు. గురువారం స్థానిక బీ క్యాంప్‌లోని ' మన వృద్ధుల, పిల్లల ఆశ్రమంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన న్యాయ సహాయం కోసం వృద్ధులు లీగల్ సెల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబర్ 15000 ద్వారా ఏవైనా సమస్యలను తమ సంస్థకు తెలియజేయాలన్నారు. వయో వృద్ధులకు ఉన్న సంక్షేమ పథకాలను వివరించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే వృద్ధుల సహాయం కోసం ఒక న్యాయవాది, ఎన్‌జీఓల నుంచి ఒకరు, సీనియర్ సిటిజన్స్ నుంచి ఒకరిని నియమించామన్నారు.. ఈ సదస్సులో ఎన్‌జీఓ డా.రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది పాపారావు, మన వృద్ధుల ఆశ్రమం నిర్వాహకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### కమనీయం.. పార్వేట మహోత్సవం



బాచేపల్లిలో ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి పార్వేట మహోత్సవాల్లో భాగంగా గ్రామ గ్రామాన విశేష పూజలందుకునేందుకు కొండదిగిన ఉత్సవ పల్లకీకి గురువారం బాచేపల్లి గ్రామంలో విశేష పజలు అందుకుంటూ ఊరేగుతోంది. గ్రామ ప్రజలు తరలివచ్చి ఉత్సవ పల్లకీకి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీని గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచుతూ భక్తిని చాటుకున్నారు.

### అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు

ఆదోని అర్బన్: నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన భూ రిజిస్ట్రేషన్‌ను గురువారం టూటౌన్ పోలీసుల సమక్షంలో రద్దు చేశారు. గతేడాది డిసెంబర్ 31న ఎగ్గటి ఈశ్వరప్ప తన తండ్రి అని.. ఎగ్గటి ఆముదాల భాస్కర్ అనే వ్యక్తి నకిలీ డెత్, ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను సృష్టించి రూ.35 కోట్ల విలువ చేసే 6.51 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించిన విషయం పాఠకులకు విధితమే. ఈ మేరకు గురువారం అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు సబ్‌రిజిస్ట్రార్ ఉదయ్‌కుమార్ తెలిపారు. అయితే సబ్ రిజిస్ట్రార్ హాజీమియా, రిజిస్ట్రేషన్ చేయించుకున్న చాకలి ఈరన్న పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### ఎమ్మిగనూరులో పట్ట పగలే చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సాయిగణేష్ కాలనీలో గురువారం మధ్యాహ్నం పట్ట పగలే ఓ ఇంట్లో దొంగలు పట్టారు. స్థానికంగా నివాసముంటున్న టి. రమణగౌడ్ కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి నీలకంఠేశ్వరస్వామి జాతరకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 2 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. జాతర నుంచి ఇంటికొచ్చిన యజమానికి తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని పట్టణ పోలీసులు తెలిపారు.



## రైతన్నల జాతర



చెర్నకోలు, ముకుతాళ్లతోపాటు ఎద్దులకు ఉపయోగించే అలంకరణ సామగ్రి







జాతరలో విక్రయానికి ఉంచిన ఎద్దులు

బండలాగే భుజ బలమున్న గిత్తలు.. పదునైన కొమ్ములున్న కిలారి కోడెలు.. రంగురంగుల ఎడ్ల బండ్లు.. దుక్కిదున్నే నాగళ్లు.. విత్తు వేసే గొర్రులు.. కోత కోసే కొడవళ్లు.. కుప్ప నూర్చే యంత్రాలు.. నెల రోజులపాటు జరిగే ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర రైతన్నల పండుగను తలపిస్తోంది. వ్యవసాయానికి కావాల్సిన వస్తు సామగ్రి అంతా ఒకే చోటు లభిస్తుండటంతో అన్నదాతలు ఎక్కడెక్కడి నుంచో వచ్చి తమకు కావాల్సినవి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. పట్టణంలోని మంత్రాలయం రహదారి సమీపంలో వివిధ జాతుల వృషభాలు పెద్ద సంఖ్యలో విక్రయానికి ఉంచారు. జత ఎద్దులు రూ.1 లక్ష నుంచి రూ.2.60 లక్షల వరకు ధర పలికాయి. ఎద్దులకు కావాల్సిన ముకుతాళ్లు, మెడలో వేసే గంటలు, పన గజ్జులు, మూగలు, కుచ్చులు, కొమ్ములకు అలంకరించే వస్తువులు, పగ్గాలు, గొండెలు తదితర సామగ్రిని కొనుగోలు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపారు. శ్రీనివాస సర్కిల్‌లోని ఓ ఇంటిలో విక్రయానికి ఉంచిన రోకళ్లు, కత్తిపీటలు, పెన్నం, కొడవళ్ల కొనుగోలులో గ్రామీణ మహిళలు నిమగ్నమయ్యారు. వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో టైర్లతో కూడిన ఇనుప బండ్లు, ఇనుప గొర్రులు, నాగళ్లు తదితర వ్యవసాయ సామగ్రి అమ్మకానికి ఉంచారు.

– ఎమ్మిగనూరుటౌన్



కత్తిపీటలు, కత్తులు, రోకలి బండలు, పెన్నాలు



టైర్లతో కూడిన ఇనుప బండ్లు



ఇనుప గొర్రులను పరిశీలిస్తున్న రైతులు